# స్త్రీ ధనం

రచన:
'కె. ఓమ్ శివ'

"ఎలాగైనా సాయంత్రం లోపల పది వేలు సంపాదించాలి. కాని, తనకు ఎవరు అప్పు యిస్తారు?.... సంపాదించడం ఎలా? ఆఁ-షాపు ఓనర్‌ను అడుగుదాం. నేను గత రెండు సంవత్సరాలుగా కనీసం ముప్పై వేలు అయినా లాభం చూపించి వుంటాను. రాత్రి అనకా, పగలు అనకా కష్టపడి ఎంత పని చేశానని! అయినా తనకి ఎప్పుడైనా పైసా యిచ్చాడు? ఆఁ ...అయిదు వందల జీతం తప్ప. ఎలాగయినా సరే ఒప్పించి, పది వేలు అప్పు తీసుకోవాలి. లేకపోతే తల్లి నాకు దక్కదు!" అనుకుంటూ వర్క్-షాపు చేరుకున్నాను.

ఎన్నో విధాల బ్రతిమాలినా ఆ కర్కశ హృదయం కరగలేదు. సరి కదా గట్టిగా మాట్లాడావంటే ఉద్యోగం పూడుతుంది జాగ్రత్త అని భయపెట్టి, మరీ పంపించాడు మా షాపు ఓనరు. నాకు అనుభవం వస్తుందని స్వార్థం వున్నా ఎవరు కూడా అలా గొడ్డులాగ కష్టపడరు.... L. M. E. పాసైన వెంటనే ఆ ఫేబ్రికేషన్ షాపులో జాయిన్ అయ్యాను - ఇకనైనా నా తల్లిని సుఖపెడదాం అని. కాని, నా ఆనందం ఎక్కువ రోజులు లేకుండానే అమ్మ మంచం పట్టింది.

'అమ్మ' అనేవి రెండు అక్షరాలే. అయినా ఎంత మధురమైనవి? ఎంతటి నిస్వార్థమైనవి? తను తినినా, తినక పోయినా, తను ఏమైనా తన బిడ్డకు ఏ కష్టం కలుగ కూడదని అమ్మ పడిన కష్టాలు నాకు యింకా జ్ఞాపకం వున్నాయి. చిన్నప్పుడే తండ్రి నాకు దూరమైన ఆ లోటు తెలియకుండా పెంచింది. నేను చదువుతానన్న చదువు నన్ను చదివించింది. టెన్తులో స్కూలు ఫస్ట్ వచ్చిన నన్ను 'పోలిటెక్నిక్' జాయిన్ చేయమని మాష్టారు సలహాను అమలు పరిచింది. మా ఊరులో లేకపోయినా పక్కన వున్న పట్నం పంపి మరీ చదివించింది. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చింది. ఇక అమ్మకు సుఖ పెడదామన్న టైమ్‌లో అమ్మకు అనారోగ్యం.

డబ్బు ఎలాగ సంపాదించాలో పాలుపోవడం లేదు. డబ్బు లేకపోతే ఆపరేషన్ ఆగిపోతుంది. ఆపరేషన్ ఆగితే అమ్మో! మరి తను ఆలోచించ లేదు. ఎలా? ఏం చెయ్యాలి?

అప్పుడు గుర్తుకు వచ్చాడు పేరయ్య. రెండు నెలల క్రితం తన కోసం ఒక సంబంధం తెచ్చాడు. అమ్మాయి కాస్త కుంటిదట. కట్నం క్రింద ఎక్కువగానే ముట్టచెప్తారు అని. అప్పుడు తను - నేను కట్న కానుకలు తీసుకోను. అయినా ప్రస్తుతం ఆ వుద్దేశంలో లేను అని త్రిప్పి పంపేశాను.

ఇప్పుడు మెరుపులాంటి ఒక ఆలోచన వచ్చింది .. వెంటనే ఆ పేరయ్యను కలుసుకొని నేను ఆ పెళ్ళికి సిద్ధమేనని చెప్పాను. అతను ఆశ్చర్య పోయాడు. కాని, నేనొక షరతు పెట్టాను. నాకు సాయంత్రం లోపు డబ్బు కావాలి అని. అదీ అప్పుగా మాత్రమేనని.

ఆ షరతుకు అటువైపు వారు కూడా అంగీకరించడంతో మా అమ్మ ఆపరేషన్ దిగ్విజయంగా ముగిసింది. 'అమ్మ' కోలుకుంది. నా కళ్ళల్లో వేయి దీపావళుల వెలుగు వెలిగింది.

ఓ శుభ ముహూర్తాన నాకు, సుశీలకు వివాహమయింది. సుశీల పేరుకు తగ్గట్టే మంచిది. నాకు అనుకూలవతిగా, అమ్మ మనసు నెరిగి మసలుకునేది. నాకు ఎన్నాళ్ళ నుంచో ఉన్న కోరిక ప్రకారం ఓ ఫ్యాక్టరీని స్థాపించాను.

దానికి పెట్టుబడి మా మావగారే పెట్టారు. అదీ నేను అప్పుగా మాత్రమే తీసుకున్నాను. నేటి ప్రభుత్వ విధానం కూడా మా లాంటి ప్రోత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా వుండడం నా అదృష్టంగా తలంచి, ఏ మంచి రోజున 'సుశీల ఇండస్ట్రీస్' ప్రారంభించాను.

అనతి కాలంలోనే మా ఫ్యాక్టరీకి మంచి పేరు ప్రఖ్యాతులు లభించాయి. ఫ్యాక్టరీకి మంచి లాభాలు కూడా వచ్చాయి. ఆ రోజు నాకు ఎంతో ఆనందంగా వుంది. ఆ రోజు ఫ్యాక్టరీలో పెద్ద పండగ లాంటిది జరుపుకున్నాం. ఎందుకంటే ఫ్యాక్టరీ మీదవున్న అప్పులన్నీ తీరిపోగా - ఫ్యాక్టరీ నా స్వంతమయింది. మా మావగారి దగ్గర తీసుకున్న లక్ష రూపాయలు కూడా వడ్డీతో చెల్లించాలి అని నిశ్చయించుకున్నాం. ఆ విషయమే సుశీలకి చెప్పాను.

ఆమె "ఏమండీ, ఆ డబ్బు మా నాన్నగారు మనకు కట్నంగా యిచ్చిన మొత్తమండీ! మీరు కట్నం అంటే తీసుకోరని మీకు అప్పుగా యిచ్చారు. మీరు దానిని ఆయనకు తిరిగి ఇవ్వనక్కరలేదు" అంది.

నేను దానికి అంగీకరించక 'ఆ డబ్బు ఒకవేళ కట్నంగా యిచ్చినా, అది నీది; కాని నాది కాదు. అది స్త్రీ ధనం.

అది నీ యిష్టం వచ్చినట్లు వుపయోగించుకో! కాని నాకు వద్దు" అంది.

దానికి సుశీల "ఏమండీ, ఇంకా మీరు వేరు; నేను వేరునా? అంటే మీరు నన్ను ఇంత కాలమైనా నమ్మడం లేదు అన్న మాట!" అంది బాధగా.

నేను ఆమెను గుండెకు అదుముకుంటూ, "కాదు. నీవు నన్ను అర్థం చేసుకోవడం లేదు. నాకు చిన్నప్పటి నుంచి ఇలాంటివి అంటే పడదు. అయినా నీకు తెలుసో తెలియదో ఒక్క విషయం. పూర్వం కూడా మన పూర్వీకులు స్త్రీలు తెచ్చే ధనం ఆమె ఆధీనంలోనే స్త్రీ ధనంగా వుంచేవారు. దానిని వాడడం అంటే తమను తాము నిందించుకున్నట్టుగా భావించుకునే వారు. కాబట్టి ఆ డబ్బు నీ ఆధీనంలోనే వుంచుకొని మన అమ్మాయి అత్తవారి ఇంటికి వెళ్ళేటప్పుడు సంతోషంగా అప్పచెప్పు. అంతే కాని, నాకు మటుకు వద్దు. దయచేసి నన్ను అర్థం చేసుకో!" అంటూ ఆమె పేరే తరువాత బ్యాంక్‌లో వేశాను.

తరువాత కూడా మా అబ్బాయి కూడా నా మార్గమే అనుసరించారు. ఎందుకంటే వాళ్ళకు కూడా తెలుసు 'స్త్రీ ధనం'. వాడుకోవడం అంటే తమ మగతనం మీద తమకు అనుమానము వచ్చినట్లేనని!....

*

# కొన్ని నిజాలు

ఎవరయినాసరే కొందరి జీవితాలతో ఆటలాడాలి కాని, ప్రజల జీవితాలతో ఆటలాడితే నికృష్టమైన మనక్షోభ ననుభవిస్తారు.

మంచి కోసం, జాతి నిర్మలత్వం కోసం కొందర్ని ప్రేమిస్తూ [నటిస్తూ], మరికొందర్ని ద్వేషిస్తూ [పగ సాధిస్తూ] యుక్తితో పని సాధిస్తే అది నిజమైన దేశ ప్రేమ, ప్రజాభిమానము కాదు! శత్రువును, మిత్రుడిని సైతం ఒకే ప్రేమభావంతో చూడాలి. తప్పులు మన్నిస్తూ మంచిని నేర్పాలి. అపుడే శత్రువు సైతం కరగి ప్రేమిస్తాడు.

ప్రతివ్యక్తి శత్రువుకు మేలు చేసినట్లయితే దేశంలో ప్రేమభావం రూపొందుతుంది. కోపాలు, ద్వేషాలు, కష్టమైన చట్టనిబంధనలు ప్రజలలో విప్లవ భావనలను రేకెత్తిస్తాయే గాని ప్రేమభావాలను ఉద్భవింప జేయవు.

సాధారణంగా అందలం ఎక్కాలనుకునే ఆడవాళ్ళే, జీవితం అందవిహీనం చేసుకుని, అంధకారంలోపడి కొట్టుకుంటారు.

# మామగారు - మాగాయ

రచన : కోలపల్లి ఈశ్వరరావు

ఎండా కాలం వచ్చిందని తెగ గింజుకుంటోంది మా బామ్మ—పెరట్లోకి, ఇంట్లోకి ఒకటే తిరుగుడు. అలా వంద సార్లు ప్రదక్షిణ చేసి, ఉసూరుమంటూ హాల్లో చతికిల పడేది. ఈ ప్రదక్షిణల సమయంలో మనం ఏం చెప్పినా వినిపించదు. మన ధ్యాసే పట్టించుకోదు.

'తొంభై తొమ్మిది, నూరు' అంటూ లెక్కించుకుంటూ, గిర్రున తిరిగి 'దబ్' మంటూ హాల్లో పడింది. వెంటనే 'కెవ్వు' మన్న చావుకేక వినిపించింది. అందరం హాల్లోకి వచ్చాం. అక్కడ దృశ్యం మాకు నవ్వు తెప్పించినా సమయం కాదని వూరుకున్నాం.

గబుక్కున వెళ్ళి మా బామ్మని లేవనెత్తాం. మా బామ్మ గడ్డి క్రింద నుగ్గు-నుగ్గయిన మామేనత్త పర్వత లక్ష్మి మూలుగుతూ కనిపించింది. మేము ఆవిడను గమనించలా?

"ఇంతకీ కేక పెట్టింది నువ్వా అత్తా?" అన్నాను వచ్చిన నవ్వును ఆపుకుంటూ.

"అవున్రా నాయనా! కొండ పడింది నా పైన - ఏం చేయను?" అంటూ మూలుగుతూ నా సహాయంతో పైకి లేచింది.

అప్పటికే బామ్మ సోఫాలో దర్జాగా కూర్చుని మజ్జిగ త్రాగుతోంది. అది ఆలవాటు.

"అమ్మో - నాయనా! ఉదయం ఏ దెష్టదాని ముఖం చూశానో మిన్ను విరిగి మీద పడ్డట్టు - అంతంత శరీరాలు ఎలా బలుస్తాయో...." అంటూ అత్త కూడా సోఫా చేరింది.

బామ్మ చేతిలోని ముప్పావు పేరు మజ్జిగ గ్లాసుని విసిరి నేలమీద కొట్టింది.

"ఎవతివే - శరీరాలు - నీ అమ్మలావు కాదా - తేరగా వచ్చిందని పదేళ్ళు నా ఆఖరోడి దగ్గర తిని బలవలా - రోడ్రోలర లా - గిరగిరా తిరుగుతూ. మక్కాల్ చీరలు చాలక - పదారు గజాలు వేయించుకోలా - సిగ్గు లేకపోతే సరి. ఉజాడి వాటిని యింట్లోకి తేకూడదురా నాయనా!" అంటూ నా వైపు తిరిగింది బామ్మ.

"మాటలు జాగ్రత్తగా రానీవమ్మోయ్... మేమేం గతి లేక రాలా! అయినవాళ్ళు కదా అని వచ్చా. అసలు మా అక్కకూతుర్ని మీ శీనిగాడికివ్వటమే తప్పు. అది రంభలా